కథ

# చిన్నబాలశిక్ష

- వి.యస్.మంజుల

**గంభీర**నిశ్శబ్దం. ఒక్కోసారి క్షణకాలమైనా సరే భయంకర నిశ్శబ్దాన్ని భరించటం చాలా కష్టం. సరిగ్గా అలానే వుంది ఆ గదిలో వాతావరణం.

చేతిలో వున్న ఓ కొత్త పుస్తకాన్ని చాలా ఇబ్బందిగా, అయిష్టంగా పట్టుకుని వున్నాడు మురళి. ఇక తనవల్ల కాదనే భావనతో ఎదురుగుండా కూర్చుని వున్న ఓ పెద్దావిడకి అందిస్తుండగానే, "నా మాట ఈ ఒక్కసారికీ విను మురళీ! పెద్దదాన్ని చెపుతున్నాను'' అంది నచ్చచెపుతున్నట్టుగా.

"అది కాదాంటీ... మీకు తెలుసుగా! నాకు అ... మ్మ...'' అంటూ పూర్తిగా మాట్లాడలేక ఆపేసాడు మురళి. వెంటనే ఎదురుగుండా కుర్చీలో కూర్చుని వున్న ఆవిడలేచి మురళి పక్కనే కూర్చుని భుజం తడుతూ....

"మురళీ! ఒక్క వాస్తవాన్ని ఎప్పుడైనా గుర్తించే ప్రయత్నమైనా చేసావా?'' అంటూ ప్రశ్నించింది-

"ఏమిటన్నట్టు?'' కళ్ళతోనే ఎదురు ప్రశ్నగా చూసాడు మురళి.

"ఈరోజున ఏ పేపర్ చదివినా, ఏ టి.వి ఛానలు చూసినా, మరే పత్రిక తిరగేసినా నీ గురించిన ప్రస్తావన లేకుండా ఏదీలేదు. ఇంతటి ప్రతిభాపాటవాలు, పేరు ప్రఖ్యాతులు, నీకు రావటానికి శారద కృషి ఎంతవుందో గమనించావా?'' అని అడిగింది సూటిగా.

"నా స్వయంకృషి ఏమీ లేదంటారా?'' ఎదురు ప్రశ్న ఆవిడకే. "లేదనికాదు. ఏదైనా మనం సాధించాలంటే ఎవరికైనా సరే ఓ మార్గదర్శి తప్పక అవసరం. మనం ఒప్పుకున్నా, లేకపోయినా ఎవరో ఒకరి ప్రభావం మన హృదయాంతరాళంలో ముద్రించుకుపోయి వుంటుంది. నీ విషయంలో ఆ మార్గదర్శి శారదేనన్న విషయం గుర్తించు, చాలు'' అంది లలితాంటీ వాస్తవాన్ని నొక్కి చెపుతున్నట్టుగా మురళి నుండి ఎటువంటి సమాధానమూ రాకపోవటంతో... మళ్ళీ ఆవిడే - "చూడు మురళీ, ఇన్నాళ్ళూ.. నీ మనసు పొరలలో వున్న దురభిప్రాయం అనుకో... అపోహ అనుకో... మరేదైనా కానీ... శారదపై నీకున్న భావన మాత్రం తప్పకుండా ఓ మంచుపొరలా కరుగుతుందనేది నా దృఢాభిప్రాయం...'' అని అంటున్న ఆవిడని మధ్యలోనే ఆపి...

"మీ ప్రయత్నం వ్యర్థం లలితాంటీ... ఎన్నో సంవత్సరాలుగా నాలో పేరుకుని, కూరుకుని, కరడుకట్టుకొని వున్న భావనని మీరు మంచుతో పోల్చుతున్నారు. అంతా తెలిసి కూడా ఎలా అంటున్నారిలా?'' అన్నాడు నిర్మోహమాటంగా.

"పిచ్చివాడా! అంతా తెలిసికూడా అని నువ్వే అంటున్నావుగా. నీకు తెలియంది, నాకు తెలిసింది, తెలియజేయటమే ఈ నా ప్రయత్నం. కాదనకు. నా మాటవిని ఒక్కసారి... ఒకే ఒక్కసారి ఆ మొదటిపేజీ చదువు చాలు. ప్లీజ్... '' అంది ఆ పెద్దావిడ దీనంగా బ్రతిమాలుతున్నట్టు. ఆవిడకి ఎలా నచ్చచెప్పాలో మురళికి అర్థంకావట్లేదు. 'ఎవ్వరికైనా తన అభిప్రాయం నిర్మొహమాటంగా నిక్కర్షగా చెప్పగలిగే తను ఇవాళెందుకు చెప్పలేకపోతున్నాను' అనుకున్నాడు తనలో తను మురళి. కాదు చెప్తాను. చెప్పితీరుతాను అనుకుని తలెత్తిన మురళిని చూస్తూ - "అమ్మను కాదు లలితాంటీని ఒక్కసారి... ఒకే ఒక్కసారి ఆ మొదటిపేజీ చదువు చాలు'' అంది వణుకుతున్న గొంతుతో.

అంతే... నోటమాట ఆగిపోయింది. కళ్ళు దించేసాడు మురళి.

ఓ క్షణం చేతిలో వున్న పుస్తకంపై వున్న ముఖచిత్రాన్ని పరిశీలనగా చూస్తూండిపోయాడు.

ఓ చిన్నబాబు చేతిలో పెద్ద బెత్తం పట్టుకుని ఎదురుగుండా కూర్చొని వున్న ఓ స్త్రీకి పాఠం చెపుతున్నట్టుగా వుంది. పక్కనే ఓ బోర్డు గోడకు తగిలించి వుంది. ఆబోర్డుపైన "చిన్నబాలశిక్ష'' అని రాసి వుంది. అతని కళ్ళకదలికలను గమనించిన లలితాంటీ, ఠక్కున

నిజంగా బిడ్డల క్షేమం కోరే ఏ తల్లి అయినా చేయవల్సింది ఒకటుంది. పిల్లల్ని తమ స్థాయికన్నా ఓ మెట్టు తక్కువ స్థాయిలోనే పెంచటం అన్నది. మన మెలాగూ అనుభవించలేకపోయాం కదా! మన పిల్లల్ని అయినా అనుభవించనీ అనేది చాలా మంది తల్లిదండ్రుల భావన. కానీ అది సరైనది కాదు.

"అది ఆ పుస్తకానికి శారద పెట్టిన పేరు" అంది.

అవునా! అన్నట్టు తలూపాడు. వణుకుతున్న చేతులతో మొదటిపేజీ తీసాడు మురళి.

అందరికీ వందనం -
సృష్టిలో ప్రతిబిడ్డకీ
ప్రథమ గురువు తల్లి... కానీ...
నాకు కర్తవ్య బోధచేసి
తను బోధకుడయ్యాడు నా బిడ్డడు.
ఆ మేలుకొలుపుతో...
కన్నపేగుకి కసాయితనాన్ని కలిపి,
కఠినశిల కరగదనేలా ప్రవర్తించి,
కడదాకా కన్నబిడ్డ కళ్ళలో
నిరాకరణనీ, నిరాదరణనీ ఎదుర్కొన్న
ఓ నిర్భాగ్యురాలు నివేదించే... ఈ
"చిన్నబాలశిక్ష" ప్రతి తల్లికీ, తండ్రికీ
ఓ మేలుకొలుపు కావాలని
మనసారా ఆశిస్తూ... ఆకాంక్షిస్తూ...
- శారద.
అంకితం: నే కన్న నాపేగు బంధం 'మురళి'కి
గురుదక్షిణగా...

ప్రతి అక్షరం - ఒక్కోపేగునీ కదిలించింది మురళికి ప్రతివాక్యం - పేగుబంధాన్ని గుర్తుచేసింది బిడ్డడికి...

చదవటం పూర్తయ్యేసరికి రెండు కళ్ళూ నీటి గుండాలయ్యాయి మురళికి. కంటి వరద... మనసు పరదా తొలగినట్టయ్యి ధారగా కారసాగింది. తల్లీబిడ్డలది నాభి బంధం. అక్కడి నుండీ దుఃఖం తన్నుకొచ్చింది. ఇన్నాళ్ళూ నిక్షిప్తంగా గూడుకట్టుకుని వున్న రక్తబంధం నాడీ వ్యవస్థనే కదిలించినట్టనిపించింది. కంటి ధారని ఆపే ప్రయత్నం చేయలేదతను. ఆ వరద వెనక అంతరార్థం గ్రహించిన లలితాంటీ నిశ్శబ్దంగా లేచి వెళ్ళిపోయింది. తన కర్తవ్యం ముగిసింది. ఇక ఇప్పుడు తను వద్దన్నా, ఆ పుస్తకాన్ని చదవడం మురళి ఆపడనే నమ్మకంతో, నిశ్చింతతో.

బాహ్య ప్రపంచానికి అతీత స్థితిలో వున్న మురళి ఎన్నో ఏళ్ళ తరువాత ఆ పేగుబంధాన్ని - ఆ మూర్తి రూపునీ గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడతను. కుదరట్లేదు. రూపం ఆనవాలు కూడా అందట్లేదు. గుండె పిండినట్టయ్యింది. "అదేంటి? ఇంత శిలగా తనెప్పుడు మారాడు? ఎందుకిలా జరిగింది? ఎంత ద్రోహం తనది. తనకో రూపాన్నిచ్చి... నాభి బంధంతో ఊపిరిపోసిన- జన్మ నిచ్చిన "దేవతనా నే తలుచుకుని, పోల్చుకోవాల్సి వస్తున్నది. పాపిని నిజంగానే నే పాపాత్ముడిని" అని అనుకుంటూ కన్నీటిని తుడుచుకుంటూ చూసేసరికి కానీ తెలియలేదు ఎదురుగుండా లలితాంటీ లేదన్న విషయం. తెరచివున్న తలుపు సాక్ష్యంగా నిలుచునివుంది.

'జ్ఞానవాకిలి తెరచి వెళ్ళిన పుణ్యమూర్తికి వందనం' అనుకుంటూ నమఃస్సుమాలనర్పించుకున్నాడు మురళి- సోఫాలో నుండి లేచి నిలబడుతూ... తడబాటుతో తూలి పడబోతూ... కాలికి పక్కనున్న కుర్చీ ధన్‌మని కొట్టుకునే సరికి ప్రాణం పోయినట్టయి ఆ బాధకి- "అమ్మా" అంటూ చేతిలో పుస్తకాన్ని గుండెలకి హత్తుకున్నాడు మురళి అప్రయత్నంగానే. మరుక్షణం, ఆ పుస్తకంపై వున్న స్త్రీ మూర్తి తన తల్లిగా రూపుదాల్చి... "బాబూ!" అంటూ అక్కున చేర్చుకుని, "ఎన్నాళ్ళకి నన్ను మనసారా పిలిచావు నాయనా!" అన్నట్టనిపించింది అతనికి. ఆశ్చర్యంతో నరనరాలు ఝల్లుమన్నాయి మురళికి.

"అవును. ఇది సత్యం. ఇంతసేపూ రూపు గుర్తురాని అమ్మ మనసుతో "అమ్మా!" అని అప్రయత్నంగా పిలిచేసరికి ఎదురుగా ప్రత్యక్షమయినట్టనిపించడమేమిటి? ఈ పుస్తకం అమ్మకి ప్రతిరూపమా! లేక జీవమా! ఇంతకీ ఈ పుస్తకంలో అమ్మ ఏం రాసింది? తను ఆవిడని ఎలా

నిర్లక్ష్యం చేసినదీ- నిరాదరించినదీ, నిరాకరించిన విషయం అన్నీ రాసిందా? ఇలాంటి కొడుకున్నాడనే ఆవేదనకి అక్షర రూపమే ఈ పుస్తకమా?'' అనుకుంటూ ఆత్రంగా.. గబగబా.. తలుపువేసి వచ్చి, ఆ చిన్న పుస్తకాన్ని అపురూపంగా పట్టుకుని చదవడానికి కూచున్నాడు మురళి.. మనస్ఫూర్తిగా.

"పాఠకులకు ప్రణామం"

కన్నబిడ్డలకి- తల్లితండ్రులు వేసిన సంస్కార బీజం ఎన్నటికీ చెక్కుచెదరదు. ప్రాణాలను ధారపోసి వారి కోసం జీవితాన్నే అంకితం చేస్తారు. కానీ, ఆ తల్లీబిడ్డల స్వచ్ఛమైన బంధం మాత్రం పిల్లలకి 14 సం.రాలు వచ్చేవరకే. అప్పటి దాకా ప్రాకారంలా నిలబడి పిల్లలకి రక్షణనిస్తుంది పెద్దవారి అండ ఆపైన సాగే వారి గమనంలో తారసపడే అనేకానేక విషయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. బిడ్డలు విధివశాత్తూ గతి తప్పి ప్రవర్తిస్తే, దానికి తల్లిదండ్రులని బాధ్యులను చేయటం మాత్రం తగదు. పంట నాశనం ఏ రైతూ ఆశించడు కదా!

నిజంగా బిడ్డల క్షేమం కోరే ఏ తల్లి అయినా చేయవలసింది ఒకటుంది. పిల్లల్ని తమ స్థాయికన్నా ఓ మెట్టు తక్కువ స్థాయిలోనే పెంచటం అన్నది. మన మెలగూ అనుభవించలేకపోయాం కదా! మన పిల్లల్ని అయినా అనుభవించనీ అనేది చాలా మంది తల్లిదండ్రుల భావన. కానీ అది సరైనది కాదు. అనుభవించకపోవటం వల్లనే మనం ఉన్నదాంట్లోనే సర్దుకోవడం అలవర్చుకున్నాం. లేనిదానికై క్రుంగిపోకుండా నిలదొక్కుకుని వుండడమనే మనోబలాన్ని పొందామనే విషయాన్ని మర్చిపోతున్నారు. జీవితంలో జీవించడమెలాగో తమ వంతుగా నేర్పండి.

చివరగా, పుస్తకం రాసిన ఫలితం ప్రతి ఒక్కరికీ చెందాలనీ, అందాలనేదే నా తాపత్రయం. ఆశ కూడా. ఇందులో నేను, నా బాబుతో జరిపిన సంభాషణలని మీరంతా మంచి మనసుతో స్వీకరిస్తారు కదూ!

బాబూ! నువ్వు ఈ ప్రపంచంలోకి వచ్చిన క్షణం- నాకో అపురూపమైన వరం. తల్లినై మరో జన్మనెత్తిన నేను నా ప్రాణాన్ని కూడా నీలోనే చేర్చాను. నువ్వు తప్ప నాకు వేరే ప్రపంచంలేదని అనుకుని నీతోడిదే లోకమై బ్రతికాను. ప్రపంచంలో ఏ తల్లీ నాలా గారాబంగా పిల్లల్ని పెంచలేదనే గర్వం కలిగేది. కానీ ఆనక తెలిసింది నే చేస్తున్న ఘోరమైన నేరం ఏమిటో! అదీ నీ వడిగిన చిన్ని ప్రశ్నతోనే!! పసివాడివైనా నా తప్పు నాకు తెలిసేలా చేసి నీ

> "ఏం బాబూ! ఇవాళ స్కూల్లో ఏ టీచరూ నోట్సుల్లో ఏం చెప్పలేదనుకుంటాను?" సమాధానం చెప్పలేదు మురళి. కొడుకులో ఏదో తేడా గమనించిన ఆవిడ మరోసారి కొడుకు వైపు చూస్తూ!"

జీవితాన్ని నువ్వే నేర్పుగా మలుచుకున్నావు బాబూ! మరుజన్మంటూ వుంటే నేనే నీకు బిడ్డనై, నీవే నాకు తల్లివై జన్మనెత్తుదాం, ఋణం తీర్చుకుందాం.

నా బిడ్డడు కాలు కింద పెట్టకుండా, ఎండ కిరణం తాకకుండా, లేత చేతులు కందకుండా, అనుక్షణం కాచుకున్నానని విర్రవీగాను మూర్ఖంగా. ఎండ తీవ్రత తగలాలనీ, ఆ చెమటని లేత చేతులు తుడవాలనీ, నేల వేడికి పాదం కందాలనీ అప్పుడే కష్టం విలువ తెలుస్తుందనీ గ్రహించలేకపోయాను.

"అమ్మా! ఆకలి" అని ఏనాడు నిన్ను నోరు తెరచి అడగనీయలేదు. అలా కాచాను. కానీ ప్రతి ఒక్కరికీ ఆకలి రుచి తెలియటం చాలా ముఖ్యమనే విషయం నాకే తెలియలేదు.

ఆవులించకముందే జోలపాడి నిద్రపుచ్చాను. నా బాబుకి నే రాసి, కూర్చిన పాట పాడి నిద్రపుచ్చానని ఎంత గొప్పగా భావించుకునే దాన్నో నాకే తెలుసు. ఇప్పటికీ ఆ పాట తప్ప వేరేపాట నేనెప్పుడూ పాడి ఎరుగను. ఆ తరువాత కావాలనే పాటను మార్చుకున్నాను. "ఈపాట ఎప్పుడు నేర్చుకున్నావమ్మా!" అని అడిగావు గుర్తుందా?

నేర్చుకో, ఓర్చుకో - కష్టమంటే ఏమిటో తెలుసుకో!
దుఃఖాన్నే ఆనందంగా మలుచుకో!! నేర్చుకో
ముళ్ళనే, పువ్వులుగా మార్చటం నేర్చుకో.. !! నేర్చుకో
ఎదిగినకొద్దీ ఒదిగి వుండటం అలవర్చుకో !!

మనిషి నిద్రకి పడే కునుకు "పాట్లు" నీకు రుచి చూపించలేదు - పన్నెండేళ్ల వరకూ. ఎంత పొరపాటు చేసానో నీ మేల్కొలుపుతో తెలిసింది.

చిన్నతనంలో కష్టపడితే- పెరిగాక సుఖపడతారని మా అమ్మ ఎప్పుడూ అంటున్నా నే పట్టించుకోలేదు. నే బ్రతికున్నంత వరకూ నీకు కష్టం కనుచూపు మేరలో కూడా వుండకూడదనుకునే దాన్ని- వెర్రితనంతో.

**"పిచ్చివాడా! అంతా తెలిసికూడా అని నువ్వే అంటున్నావుగా. నీకు తెలియంది, నాకు తెలిసింది,. తెలియజేయటమే ఈ నా ప్రయత్నం. కాదనకు. నా మాటవిని ఒక్కసారి... ఒకే ఒక్కసారి ఆ మొదటిపేజీ చదువు చాలు. ప్లీజ్... "**

నా కంటి దీపానివనీ, నా గుండెలపై నిను పెంచాననీ గర్వంతో విర్రవీగానే కానీ, నిన్ను ఒంటి స్థంభపు మేడలో ఒంటరివాడిని చేస్తున్నాననే విషయం గ్రహించ లేకపోయాను నాన్నా!! క్షమించు. వర్షం చినుకు ఒక్కటి ఒక్కటి కూడా నీపై పడ్డా, నువ్వెక్కడ మొలకెత్తుతావో అని కంగారుపడేదాన్ని. మొలకే మహావృక్ష ఆవిర్భవానికి ఆది అనే జ్ఞానం కలగలేదు నాకు. నువు నిద్రపోయాక నిన్ను ఎక్కడ దోమ కాటువేస్తుందోనని తనివితీరా కన్నుమూసి కునుకు తీసేదాన్ని కూడా కాదు. ఏ కాస్తయినా నీవు నలతగా వుంటే నేపడే కలత వర్ణించలేనురా కన్నా!

పిల్లలందరూ మైదానంలో ఆడుకోవడం, అల్లరి చేయడం గుమ్మంలో నిలబడి చూసిన నువ్వు - మొదటిసారి నోరు తెరచి, "అమ్మా! నేనూ ఆడుకుం టానమ్మా! ప్లీజ్" అని నువ్వు అడిగేసరికి, వద్దంటే నువ్వుపడే వేదన, బాధని వూహించలేక నీ వెనకనే నేనూ వచ్చి నిన్ను కళ్ళతో కాచుకున్నాను గుర్తుందా! నీకేం గుర్తుంటుందిలే, పసివాడివి. మిగతా పిల్లలందర్నీ చూసి, అలా వెట్టికి వదిలేసిన ఆ తల్లులనందర్నీ ఎలా మనసులో నిందించుకున్నానో నీకు తెలియదు బాబూ! అసలు వాళ్ళు కన్నతల్లులేనా? బిడ్డల్ని అలా ఎలా వదిలేస్తారు! కసాయివాళ్ళేమో! అనుకున్నానే కానీ, ఆ చర్య వెనక దాగున్న నిగూడార్థం గ్రహించలేనంత వెర్రిదిరా నీ తల్లి.

బయట గాలి, దుమారం, వర్షంగా వుంటే ఆ సమయంలో ఎక్కడ కరంటుపోతే, నే క్రొవ్వొత్తి వెలిగించే ఆ రెండు క్షణాలలో నీవెక్కడ బెదరి, భయపడతావోనని వర్షం మొదలైన దగ్గర నుండే ఎన్ని క్రొవ్వొత్తుల్ని కరిగించేదాన్నో గుర్తుందిగా! అప్పుడు గొప్పగా భావించుకుని సంతోషపడ్డా ఇప్పుడు మాత్రం నీ మేల్కొలుపుతో తలదించుకుంటున్నా బాబూ! వాస్తవాన్ని గ్రహించి- "చీకటి చూడనివాడు వెలుగుని గుర్తించలేడని" ఆలస్యంగా తెలిసింది.

పక్కలేసి పక్కనే, అక్కడే అన్నం తినిపించి, అప్పుడే నిన్ను నిద్రపుచ్చానే. అది నీ జీర్ణవ్యవస్థకి దెబ్బని గ్రహించలేని తెలివి హీనురాలిని.

ఆటల్లో అరటిదెబ్బని కూడా రుచి చూపించలేదు నీకని చాలా వెర్రిగర్వంతో భావించుకునే దాన్ని కానీ, అది నీ జీవనగమ్యానికే దెబ్బని ఆలోచించలేకపోయాను. "దెబ్బరుచి తెలిసినవాడే గమ్యం సులువుగా చేరగలడని కాస్త ఆలస్యంగా తెలుసుకుని నీకు వర్తింపచేసాను. అదీ నీ మేలుకొలుపుతోనే సుమా!

స్కూల్లో నోట్సులు రాసుకుంటే నీ లేత చేతులు కందుతాయనీ, నీవలసిపోతావనీ పొరపడ్డాను. నీ గురువులను నిందించాను. గురుద్రోహం చేసాను. నా ఎడం చేత్తో నీ దస్తూరీలా నే రాయటం నేర్చుకున్నానే కానీ, నీ జ్ఞాన దస్తూరీకి నేనే ద్రోహం చేస్తున్నానన్న విషయం తెలుసుకోలేకపోయాను.

స్కూలు బ్యాగు మోస్తే నీ లేత భుజాలు కందిపోయి, నొప్పి పెడతాయని బాధపడేదాన్నే కానీ, జీవన గమన భారంలో మనసు మథనని ఓర్చుకోవటానికి ఇవన్నీ సహకరిస్తాయనే వాస్తవం గ్రహించలేకపోయాను బాబూ!

నా ప్రాణం వున్నంతవరకూ, నిన్ను నా ప్రాణంలా చూసుకున్నాననే తృప్తి కావాలనుకున్నానే కానీ, నా మహాప్రస్థానం తరువాత నీ జీవనగతి ఏమిటి? అని ఆలోచించలేకపోయాను మొదట్లో. అందుకే ఆపై మార్పులో నీ స్వశక్తి నీ కర్థమయ్యేటట్లు చేసాను. కాస్తంత కఠినంతో విశాల విశ్వంలో - బ్రతుకు సమరంలో ఎదురీదటం అవశ్యం అన్న విచక్షణ ప్రతిజీవికీ అనివార్యం.

మూడు చక్రాల సైకిల్ అయినా తొక్కకుండా ఒకేసారి నా బిడ్డడు పెద్దబండి నడిపితే హీరోలా వుంటాడని మురిసేదాన్నే కానీ, చిన్న చక్రాల సమన్వయం నియంత్రించటం వస్తేనే పెద్దబండి నడిపే గుండెబలం దక్కుతుందన్న కనీస జ్ఞానం లేనిదాన్ని మూర్ఖురాల్ని.

ఉప్పులేని పప్పునీ - ఉప్పుతోనే పప్పనీ కూడా నీకు రుచి చూపించాను. నాకు తెలుసు రెండూ తినలేమని. కానీ సమపాళ్ళ సమతుల్యతా విలువ నీకు చెప్పాలనే నా ప్రయత్నం.

బాబూ! నీకు గుర్తుందో లేదో కానీ, నాకు మాత్రం ఆ రోజు బాగా జ్ఞాపకముంది. కన్నకొడుకు కళ్ళల్లో "ఛీ..." అన్న భావనని ఈ తల్లి మనసు పసిగట్టి, ఆ వ్యతిరేకతని జీర్ణించుకోడానికి నన్ను నేను ఎలా సమాధానపరచుకోవాల్సి వచ్చిందో నాకు తెలుసుకాబట్టి అంతగా ముద్రించుకు పోయిందా సంఘటన. అదీ నీ స్కూలు షూస్ విషయం

గుర్తొచ్చిందా బాబూ!" అన్న మాటలు చదువగానే మురళికి కూడా ఠక్కున జ్ఞాపకానికొచ్చిందా సంఘటన.

ఆరోజు ఉదయం ఎనిమిది-ఎనిమిదిన్నర మధ్య తను స్నానానికని బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తువ్వాలు మర్చిపోవడంతో మళ్ళీ బయటకి వచ్చేసరికి అమ్మ తన బ్లాక్ షూస్‌ని (కాస్త బాగానే పాడైపోయినవే) చెత్తబుట్టలో పడేస్తోంది, అది చూసి "అదేంటి? ఇప్పుడు స్కూల్‌కి నేనేం వేసుకెళ్ళాలి? వాటినెందుకు పారేస్తున్నావమ్మా?" అంటూ ప్రశ్నించాడు.

"అవి బాగా పాడైపోయాయిగా! అందుకే పారేసాను ఇవాల్టికి మామూలుగా వెళ్ళు. ఏం ఫరవాలేదు" అంది చాలా మామూలుగా అమ్మ. ఆ తీరుని అదే అమ్మ తీరుని చిన్ని మనసు తట్టుకోలేక ఒక్కసారిగా కళ్ళనీళ్లు తిరిగాయి. అంతలోనే తేరుకుని, "కొత్తవి కొన్నాక వీటిని పారేయాల్సింది. అందాకవాటినే వేసుకెళ్ళేవాడినిగా!" అన్నాడు.

సమాధానం లేదు అమ్మనుండి. షూస్ వేసుకుని వెళ్ళకపోతే స్కూల్లో ఎలా కొడతారో తెలిసిన అమ్మేనా ఇలా అంటోంది? ఎందుకు? ఎందుకు ఈ మధ్య అమ్మలో ఈ మార్పు? తనని కళ్ళల్లో పెట్టుకుని కాచే అమ్మకాదు ఈవిడ. వేరే వేరే ఎవరో! అన్న 'ఛీత్కార' భావనని తను వేసిన తలుపుచప్పుడులో అమ్మకి వినిపించాడు మురళి.

ఇప్పుడు ఇంతకీ ఆ చర్యకి అమ్మ ఏం రాసివుంటుంది? అనే ఆత్రంతో మళ్ళీ పుస్తకంలోకి చూసాడు మురళి.

"కన్నా! ఆరోజున నీ బ్లాక్ షూస్‌ని చెత్తబుట్టలో వేసానని నీకెంత కోపం వచ్చిందోకదూ! నాకు తెలుసు. నీ లేత మనసుపడే ఆవేదన నేనర్థం చేసుకోగలను కానీ. చెప్పులు లేని కాళ్ళకి రాయి గుచ్చుకునే బాధనీ, ముళ్ళు గుచ్చుకుంటే వుండే నొప్పినీ, గాజుపెంకు అరికాలిలో దిగితే కలిగే బాధనీ కూడా నీకు తెలియజేయాలనే అలాచేసాను. అంతేకాదు స్కూల్లో, గురువు వేసే ఒకే ఒక దెబ్బ ఒక్కోసారి జీవిత గమనానికి, మంచి మార్గానికి కసినీ, గురినీ ఏర్పాటు చేస్తుంది. అయినా నేనిలా చేయగలిగానంటే అది నీ మేల్కొలుపుతోనే బాబూ!"

జీవితంలో ఓ ముఖ్య విషయం ఎప్పటికీ మరువకు. "ప్రతిమనిషీ తనకున్న దాని విలువ గుర్తించి కాపాడుకునే ప్రయత్నం తప్పకచేయాలి. చేజారిపోయాక గుర్తించే విలువ వ్యర్థంలేనిది"

ఇక అసలు విషయానికి వద్దాం.

"బాబూ! నా అతిగారాబానికి తెర ఎప్పుడు పడిందో గుర్తుందా? నాకది మర్చిపోలేని, మరపురాని, అద్భుతమైన మేలుకొలుపు. పన్నెండు సంవత్సరాల పసివాడివైన నువ్వు పరిణతిచెందేందుకు కీలకమైన క్షణం అది. మొట్టమొదటి సారిగా నువ్వు అమ్మను ఎదిరించి, నిలదీసిన ఘడియ అది." ఆ చివరి వాక్యం చదవగానే మురళి మస్తిష్కం ఒక్కసారిగా ఆరోజుని గుర్తుచేసుకుంది.

"అవును. ఆరోజు తను అమ్మని పరుషంగా మాట్లాడుతూ నేరారోపణ మోపాడు. తన మాటలు విన్న అమ్మ కళ్ళలో, మోములో ఏవో అర్థంకాని, స్పష్టంగా ఇదీ అని చెప్పలేని భావావేశాలు. ఓ క్షణకాలం తచ్చాడినట్టయి కనుమరుగయ్యాయి." అసలారోజేం జరిగిందంటే....

ఉదయం లేచిన దగ్గర నుండీ అమ్మ ఎందుకో అన్యమనస్కంగా, ఏదో ఆలోచిస్తున్నట్టుగా అనిపిస్తోంది మురళికి. ఆ చిన్ని మనసుకి ఎంత ఆలోచించినా విషయం అర్థంకావట్లేదు. అలా అని రోజూలా తనకి జరిగే పనులలో ఏమాత్రంలోటు జరగనివ్వట్లేదు అమ్మ. ఎప్పటిలా అన్నీ అడక్కముందే సిద్ధంచేస్తోంది. కాకపోతే రోజూలా నవ్వుతూ... కబుర్లు చెపుతూ... తనను చలాకీగా వుంచే ప్రయత్నం మాత్రం అమ్మ చెయ్యట్లేదు. తనకిష్టమైన దోసకాయపప్పు అన్నంలో కలిపి నోట్లో పెడుతూ... ఆలోచనలతో వున్న అమ్మభుజాన్ని తట్టి...

"అమ్మా... అమ్మా... ఏమయ్యింది? ఎందుకిలా వున్నావు? ఏదన్నా చెప్పు. చెప్పమ్మా!" అంటూ ఆవిడని ఈ లోకంలోకి రప్పించాడు మురళి. "ఆ... ఆ... ఏంలేదు బాబూ! భోజనం అయ్యిందిగా ! ముందు నువ్విలా వచ్చి నాన్నగారి ఫోటో దగ్గర అగరుబత్తి వెలిగించి పూలుపెట్టి దణ్ణం పెట్టుకో, రా," అని మాత్రం అంది.

'ఓహో! ఇవాళ నాన్నగారు చనిపోయిన రోజా! అయితే మాత్రం, తనతో మాట్లాడడానికేం?' అని లోలోపల ప్రశ్నించుకుంది ఆ పసిమనసు.

స్కూలుకి వెళ్ళినా, మురళిని ఆ ఆలోచనే వేదించసాగింది. మధ్యలో సైన్సు టీచరు నోట్సు రాసుకోమంటే, పెన్నూ, నోట్సు కోసం బ్యాగంతా వెదికాడు మురళి. కనిపించలేదు. అంటే... అమ్మ పెట్టలేదన్నమాట. 'అదేంటి? అమ్మ ఇలా చేసింది. ఇంతవరకెప్పుడూ ఇలా జరగలేదు. ఇదే మొదటిసారి.' అని అనుకున్న మురళి నోట్సు రాసుకోకుండానే ఇంటికి వచ్చాడా సాయంత్రం.

**నా కంటి దీపానివనీ, నా గుండెలపై నిను పెంచాననీ గర్వంతో విర్రవీగానే కానీ, నిన్ను ఒంటి స్థంభపు మేడలో ఒంటరివాడిని చేస్తున్నాననే విషయం గ్రహించ లేకపోయాను నాన్నా క్షమించు !!**

అప్పటికి అమ్మ కాస్త సర్దుకున్నట్టుగానే కనిపించింది మురళికి. తనొచ్చేసరికి టిఫిన్‌రెడీ, స్నానానికి నీళ్ళు... అన్నీ సిద్ధం రోజూలాగానే. కానీ ఇప్పుడు మురళిలోనే మార్పు. అమ్మ తననీ, తన అవసరాలనీ నిర్లక్ష్యం చేసిందనే విషయం ఆ చిన్నారిని అసహనానికి గురిచేసింది. కాసేపటికి రోజూలానే "చదువుకుందాం రా బాబూ!" అని కూర్చోపెట్టిన అమ్మకి ఆరోజు మురళి ఏ నోట్సు రాసుకున్నట్టు కనిపించలేదు.

"ఏం బాబూ! ఇవాళ స్కూల్లో ఏ టీచరూ నోట్సు లేం చెప్పలేదనుకుంటాను?"

సమాధానం చెప్పలేదు మురళి. కొడుకులో ఏదో తేడా గమనించిన ఆవిడ మరోసారి కొడుకు వైపు చూస్తూ!

"సమాధానం చెప్పవేం? నోట్సులేం రాసుకోలేదేం?" అంటూనే "ఏ టీచరూ నోట్సు చెప్పలేదా?" అంది.

''చెప్పారు'' అన్నాడు నిర్లక్ష్యంగా మురళి. ఆశ్చర్యపోవడం అమ్మవంతైంది. ''మరెందుకు రాసుకోలేదు?'' అంది తనని తను సంభాళించుకుంటూ అంతే ఒక్కసారి అణచిపెట్టిన అసహనమంతా బద్దలయ్యేట్టుగా, "నీ మూలానే రాసుకోలేదు. రోజూ అన్నీ బ్యాగులో పెట్టే నువ్వు ఇవాళెందుకు నా పెన్నూ, నోట్సూ పెట్టలేదు. అందుకే రాసుకోలేదు. సైన్సు టీచరు చాలా స్ట్రిక్ట్ అన్న విషయం నీకు తెలుసుగా! కావాలనే పెట్టలేదు నువ్వు. ఎప్పుడూ లేదు. ఇవాళ అందరిముందూ దెబ్బలు తిన్నాను చాలా!" అంటూ అరిచి అరిచి చెప్పాడు ఉక్రోషంగా.

"అది కాదురా! ఎవరిదగ్గరైనా అడిగి తీసుకోవచ్చు కదా!" "అలా ఎప్పుడైనా, ఏదైనా ఇతరులని అడగమని చెప్పావా నీవు? ఇన్నాళ్ళూ నాకెప్పుడూ ఇలా కాలేదు. ఒకవేళ ఇలా అయితే ఏం చేయాలో నువ్వెప్పుడూ చెప్పలేదు. నాకెలా తెలుస్తుంది? ఇలాంటప్పుడు ఏం చేయాలో నువ్వు చెప్పాలి. చెప్పలేదు కాబట్టి నీదే తప్పు. నాదేం కాదు. అన్నీ చెప్పాల్సిన బాధ్యత నీది కాదా?" అంటూ అరుస్తూ తన రూమ్‌లోకి వెళ్ళిపోయాడు మురళి విసురుగా.

ఒక్కసారి చుట్టూ ప్రపంచం అంతా చీకటి మయమైంది అమ్మకి. "ఏమిటి? తను విన్న మాటలు నిజంగా తన బిడ్డడు అన్నవేనా? తన చేతులతో పెంచిన ఈ పసిమొక్కకి ఇన్ని మాటలెలా వచ్చాయి? ఎందుకిలా అన్నాడు? నేనిప్పుడేం చేసానని? ఒక్కసారి జరిగిన ఈ చిన్న పొరపాటుకి ఇంత పెద్ద ఎదురు ప్రశ్నా? నిజంగా నేను నా బాధ్యతని నిర్వర్తిస్తున్నానా లేదా? ఇంత చిన్నదానికే నే చెప్పాల్సి వస్తే... రేపు జీవితంలో...అమ్మో!" అన్న ప్రశ్నతో అమ్మ ఆలోచనల 'అల' సాగింది.

మరో పదినిమిషాలకి తనని తనే సమాధాన పరచుకున్న శారద, మురళి గదిలోకి వెళ్ళి ఏమీ జరగనట్టే, 'రోజూ లాగానే పనులన్నీ యథావిధిగా పూర్తి చేసింది. కానీ అంతర్మధనం ఆగలేదు. సాగుతూనే వుంది ఉధృతంగా. ఆ రాత్రంతా నీవు నిద్రపోయాక, నీ పక్కనే కూర్చుని ఎన్ని కఠోర నిర్ణయాల పట్టికని రూపొందించుకున్నానో నాకే తెలుసు బాబూ! వాటి ఫలితమే నేటి నీ జీవనస్థిత ప్రజ్ఞత.

ఆడపిల్ల అనే వివక్షలేకుండా మొగపిల్లాడిలా పెంచుతున్నట్టే, మొగపిల్లాడివైన నీకు స్త్రీకి వుండే దక్షతా, నేర్పు, విజ్ఞత, సహనం, ఓరిమి అలవాటవ్వాలనే కాస్తంత కటువుతనం ప్రదర్శించాను. తరువాత తర్వాత వెన్నంత మృదువుగా మెదిలే అమ్మ జున్నంత రుచిగా అక్కున చేర్చే అమ్మ. తేనెంత తియ్యగా మాట్లాడే అమ్మలో ఒక్కసారిగా మార్పు నీ లేత మనసు తట్టుకోలేకపోయింది. క్రమక్రమంగా నీ మనసు అరల పొరలలో నా పై వ్యతిరేకత, కసి, కోపం, అయిష్టత, ద్వేషం ఒకటొకటిగా పేరుకుంటు న్నాయన్న విషయం సమయం మించిపోయాక నాకర్థమయ్యింది. కానీ, నాకు నేను చెప్పుకున్న సమాధానం ఒక్కటే.

'నా ఈ మేలుకొలుపు- ప్రతి తల్లికీ- తండ్రికీ వారి వారి బిడ్డలందించే చిన్న బాలశిక్ష కారాదనేది మాత్రమే బాబూ! నువు నాకు శిక్షణతో పాటు - జీవితకాలపు శిక్షనీ వేసావు. ఒక్కోసారి 'దీపాన్ని అందుకోవటానికి - చీకటితో సావాసం తప్పదు అన్నది నా అనుభవం. తల్లిగా నే ఒక్కదాన్నే బిడ్డడి నిరాదరణకి గురి అయ్యాను. కానీ, నా ఈ "చిన్నబాలశిక్ష" విడుదల తరువాత ఏ బిడ్డడికీ

"పెద్దబాలశిక్ష" కరువవ్వదనేది నా ప్రగాఢ నమ్మకం, విశ్వాసం. నా అనుభవం నాకు నేర్పినంత వరకూ, ముఖ్యమైన కనీస విషయాలను మాత్రమే ఇందులో పొందుపరిచాను. ప్రతి తల్లిదీ ఒక్కో పాఠశాల. ప్రతి సంఘటనా ఓ పాఠం కావాలి- అందాలి అదో గుణపాఠం. సరేనా! చివరగా, తల్లిగా - జాగ్రత్త. సుఖీభవ. సర్వేజనా సుఖినో భవన్తు. *శాంతిః శాంతిః శాంతిః....*

అలా పుస్తకమంతా చదువుతూ గతించిన, గుర్తించలేని అమూల్యమైన జీవితపు తలుపు తెరచి, తలపులలో విహరించిన మురళి మనోగతం ఏదో వివరించి చెప్పలేని అనిర్వచనీయమైన అనుభూతిని ఆస్వాదించింది. మనసులో ఏదో ఓ క్రొత్త తేజోవంతమైన, నవ్యమైన ఉత్తేజం స్పష్టంగా తనకే తెలుస్తోంది.

మరుక్షణం గబగబా తన అలమరాలో ఎన్నో సంవత్సరాల క్రితం అడుగున పెట్టేసి వుంచిన అమ్మ ఫోటోని బయటికి తీసి శుభ్రం చేసి ముందుగదిలో ఎదురుగా తగిలించి, తన కొచ్చిన గౌరవ పురస్కార జ్ఞాపికలనీ, అవార్డులనీ, అమ్మ ముందుంచి గర్వంతో చూసుకుంటూ-

"వీటి వెనక శక్తివి నీవే నమ్మా! నీ స్ఫూర్తే వీటిని నాకు దక్కేలా చేసింది. జీవితపు విలువల శిక్షణ నిచ్చిన నీకు నేనందించింది మాత్రం కఠోరశిక్ష. ఏ తల్లికీ ఇంత కన్నా మించిన అవమానం మరొకటి వుండదు. క్షమించు అమ్మా! క్షమించు. మళ్ళీ నన్ను నీ గర్భంలో చేరిపోనీ! నీ ఒడిలో పసివాడినై కేరింతలు కొట్టాలనివుందమ్మా! నీ చేతి గోరుముద్దలు, మురిపాల గారాబాలూ కావాలనుందమ్మా. నిజం నిజంగా నేనిప్పుడు ఒంటరి వాడినేమో అనే వాస్తవం గ్రహించాను. ఇన్నాళ్ళూ నేవుండీ నీవెలా దిక్కులేని దానిలా అల్లాడావో ఊహించలేకుండా వున్నాను. పశ్చాత్తాపంతో నీ ముందు మోకరిల్లుతున్నాను." అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లి ఫోటో ముందు కూలబడిపోయాడు మురళి పసివాడై.

గుండె బరువు తీరాక, మనసు తేలికపడ్డాక, మార్గం గోచరించాక, కర్తవ్యం అర్థమయ్యాక అమ్మ రాసిన "చిన్నబాలశిక్ష" పుస్తకానికి ప్రతులు వేయించే విషయమై కార్యోన్ముఖుడై, తల్లి జీవితపు చివరి కోరికని నెరవేర్చే నిమిత్తమై దృఢసంకల్పంతో ముందుకి కదిలాడు మురళి.

***

కవిత

# నమామి

నమామి వందేమాతరం
ప్రాతః స్మరామి వందేమాతరం
నూరేళ్ళగీత మిది
స్వాతంత్ర్య సమరంలో
సారధిగా నిలిచిన గీతం

బానిసత్వ బ్రతుకుల్లో
చైతన్యం వెలిగింపగ
తెల్లవాడి పాలన పై
అంకుశమై సాగిన గీతం

భారతీయ నేతలంతా
స్వాతంత్ర్య యోధులై
సాగించిన సమరాన
నినాద గీతం

భాషలెన్ని ఉన్నా
స్వాతంత్ర్యం లక్ష్యంగా
దేశమంతా ఒక్కటై
పాడుకున్న గీతం

ప్రణవనాదమై పలికింది
ప్రభంజనమై సాగింది
ప్రభుత్వాన్నే మార్చింది
ప్రజలగీతమై నిలిచింది
వందేమాతరం వందేమాతరం

**- మట్టెగుంట వెంకటరమణ**